క్లుప్తంగా

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 24 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఏఎస్పీ మురళీకృష్ణ

కంబాలచెరువు: స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్)కు 24 అర్జీలు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ ఎన్‌బీఎస్ మురళీకృష్ణ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో స్వయంగా మాట్లాడారు. వారి నుంచి అర్జీలను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు, ఫిర్యాదుదారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి సత్వరమే న్యాయం చేయాలని ఆదేశాలు ఇచ్చారు.

ఫార్మా పరిశ్రమపై అవగాహన

కంబాలచెరువు: ఆర్ట్స్ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఫార్మా పరిశ్రమపై అవగాహన అనే అంశంపై సోమవారం గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. దీనికి హాజరైన ఎస్ఎల్‌బీ ఫార్మాస్యూటికల్ శాస్త్రవేత్త డాక్టర్ నరేంద్ర బాబు హాజరై మాట్లాడుతూ దేశ ఫార్మా రంగం గ్లోబల్ స్థాయిలో ప్రాధాన్యతను సంతరించుకుందన్నారు. పీజీ విద్యార్థులకు ఫార్ములేషన్, క్వాలిటీ కంట్రోల్, పరిశోధన, రెగ్యులేటరీ అఫైర్స్ రంగాల్లో కెరీర్ అవకాశాలు చాలా ఉన్నాయన్నారు. పరిశ్రమలో నిలదొక్కుకోవడానికి అవసరమైన సాంకేతిక, నియంత్రణ సంబంధిత నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యార్థులు పరిశ్రమతో అనుసంధానమైన ప్రాజెక్టులను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టి.శ్రీనివాసరావు, డాక్టర్ బి.మల్లికార్జున, డాక్టర్ టీఎస్ మూర్తి, డాక్టర్ ఎం.త్రినాథ్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి కిశోర్ ఎంపిక



రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలోని బొప్పన సావిత్రమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన కనితి కిశోర్ నూజివీడు ట్రిపుల్ ఐటీలో సీటు సాధించాడు. అతడి తండ్రి ధర్మారావు జట్టు కూలీ, తల్లి భాను వ్యవసాయ పనులు చేస్తుంటారు. పదో తరగతి పరీక్షల్లో 97 శాతం మార్కులు సాధించడంతో పాటు అత్యున్నత ప్రతిభను కనబరిచి షైనింగ్ స్టార్ అవార్డుతో రూ.20 వేల చెక్కును విద్యాశాఖామంత్రి చేతుల మీదుగా అందుకున్నాడు. కాగా.. కిశోర్‌ను ప్రధానోపాధ్యాయులు బీఎన్‌వీఎస్ మూర్తి, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

భూలోకమ్మ అమ్మవారికి పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న చందన నాగేశ్వర్

ధవళేశ్వరం: భూలోకమ్మ అమ్మవారిని రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ దర్శించుకున్నారు. అమ్మవారి జాతరకు హాజరైన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పేర్ల బాసి, తలారి వరప్రసాద్, పందెళ్ల భాను, ముత్యాల జాన్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను వినియోగించుకోవాలి

రాజమహేంద్రవరం రూరల్: పీఎంజేఏవై పథకం ద్వారా పొందుతున్న శిక్షణను అభ్యర్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని నేషనల్ అకాడమీ ఆఫ్ కనస్ట్రక్షన్స్ (నేక్) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ డి.మనోహర్ అన్నారు. బొమ్మూరులోని నేక్‌లో పీఎంజేఏవై పథకం ద్వారా నేక్, ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న శిక్షణను ప్రాంతీయ ఉపాధి అధికారి అనిల్ కుమార్‌తో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిధులతో ఈ శిక్షణ జరుగుతోందని, శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీలతో మాట్లాడడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నేక్ నోడల్ ఆఫీసర్ పి.మురళీధర్, ఏడీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లి స్ఫూర్తితో మొక్కలు నాటాలి

రాజమహేంద్రవరం రూరల్: తల్లి నిస్వార్థంగా ఎలా మనల్ని పెంచి పెద్ద చేస్తుందో, అదే ప్రేరణతో ప్రతి ఒక్కరూ మొక్కలను పెంచాలని ఎమ్మెల్సీ, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు సోము వీర్రాజు అన్నారు. ఐటీ నిపుణులు పోలవరపు చైతన్య, పట్నాల నాగార్జున, వివిధ క్రికెట్ అసోసియేషన్‌లతో స్థాపించిన భారత్ రైజింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు గ్రామంలో ఐదు వందల మంది యువతతో వారి తల్లి పేరున వారిచే మొక్కను నాటించే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ముందుగా భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పించారు.

ఎలక్ట్రిక్.. ఫుల్ కిక్



- నగరంలో ఎలక్ట్రికల్ వాహనాల జోరు
- పెరిగిన విక్రయాలు
- ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు
- కార్లతో పోల్చితే ద్విచక్ర వాహనాలకు డిమాండ్

ప్రకాశం నగర్: ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు టాప్ గేర్‌లో దూసుకుపోతున్నాయి. పెట్రోలు, డీజిల్ వాహనాలకు బదులుగా వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. పెరుగుతున్న పెట్రోలు, డీజిల్ ధరల నుంచి ఉపశమనం, పర్యావరణ పరిరక్షణ, తక్కువ నిర్వహణ వ్యయం, మంచి మైలేజీ (రేంజ్), అత్యాధునిక ఫీచర్లు తదితర కారణాలతో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరుగుతోంది. అత్యాధునిక ఫీచర్లు, ఆకట్టుకునే హంగులతో తయారైన ఎలక్ట్రికల్ స్కూటర్లు, కార్లు నగరంలోని రోడ్లపై దూసుకుపోతున్నాయి. ప్రముఖ ద్విచక్ర తయారీ సంస్థలన్నీ ఈ విభాగంలో తమ ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాయి. వీటితో పాటు కార్ల విభాగంలోనూ అమ్మకాలు బాగా జరుగుతున్నాయి. ఇప్పటి వరకూ మెట్రో సిటీలకు పరిమితమైన ఎలక్ట్రిక్ వాహనాలపై ఇప్పుడు గ్రామీణులు సైతం ఆసక్తి చూపుతున్నారు.



ఖర్చు తక్కువ

బీఎంఎస్ మోటార్‌తో నడిచే ఈ ఎలక్ట్రికల్ స్కూటర్లు బ్యాటరీ ద్వారా పనిచేస్తాయి. బ్యాటరీ బ్యాకప్‌ను బట్టి సుమారు 4 నుంచి 5 గంటల చార్జింగ్ పెట్టాలి. అవి దాదాపు 60 నుంచి వంద కిలోమీటర్ల వరకూ రేంజ్ (మైలేజ్) అందిస్తున్నాయి. పైగా గంటకు సుమారు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తున్నాయి. డిజిటల్ డిస్‌ప్లే, యూఎస్‌బీ, మొబైల్ చార్జింగ్, బ్లూటూత్ తదితర ఆధునిక ఫీచర్లతో ఆకట్టుకుంటున్నాయి. వీటి ప్రారంభ ధర రూ. 70 వేల నుంచి రూ.1.80 లక్షల వరకూ ఉంటోంది. వీటితో పాటు టెక్నాలజీకి అనుగుణంగా బ్యాటరీతో నడిచే వివిధ ఎలక్ట్రికల్ కార్లు, రిక్షాలు, ఆటోలు అందుబాటులోకి వచ్చాయి. వాటితో పోల్చితే ద్విచక్ర వాహనాలపైనే ప్రజలు ఆసక్తి చూపుతున్నారు.

కాలుష్య రహిత ప్రయాణం

ఎలక్ట్రికల్ వాహనాల వినియోగం వల్ల ధ్వని, వాయు కాలుష్యం ఉండదని పర్యావరణ వేత్తలు చెబుతున్నారు. పెట్రోల్, డీజిల్ వాహనాలతో పోలిస్తే ఎలక్ట్రికల్ స్కూటర్లకు నిర్వహణ తక్కువగా ఉంటుంది. కేవలం చార్జింగ్ పెట్టుకుని సుమారు వంద కిలోమీటర్ల వరకూ ప్రయాణం చేయవచ్చు. నగరంలోని ట్రాఫిక్ రద్దీలోనూ సునాయాసంగా వాహనాన్ని నడపొచ్చు.

కొన్ని ప్రతికూలతలు

పెట్రోల్ వాహనాల మాదిరిగా ఎలక్ట్రిక్ వాహనాలకు ఇంజిన్ సామర్థ్యం, సులభంగా పెట్రోల్ నింపడం, రీసేల్ వాల్యూ ఉండదని ఆటోమొబైల్ వ్యాపారులు చెబుతున్నారు. అయితే కేవలం సుమారు 100 నుంచి 150 కిలోమీటర్లలోపు ప్రయాణానికే ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అనుకూలంగా ఉంటాయన్నారు. ఇవి కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులకు బాగా ఉపయోగపడతాయన్నారు. కాగా.. ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోళ్లు పెరిగిన నేపథ్యంలో కొన్ని పెట్రోలు బంకులు, హోటళ్లు, రెస్టారెంట్లు, కారు వాష్‌ల వద్ద చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశారు. కొందరు వాహనదారులు తమ ఇంటి వద్ద చార్జింగ్ చేసుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

డిమాండ్ పెరిగింది

ప్రస్తుతం మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వాహనాలకు డిమాండ్ పెరిగింది. ఆ విభాగంలో వచ్చిన కార్లతో పోల్చితే ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. ఎలక్ట్రిక్ స్కూటర్ల ధర తక్కువ ఉన్నప్పటికీ, పక్క రాష్ట్రాలతో పోల్చితే మన రాష్ట్రంలో రోడ్డు ట్యాక్స్ అధికంగా ఉంది. దీంతో ఇరుగుపొరుగు రాష్ట్రాల నుంచి వాటిని కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం రోడ్డు ట్యాక్స్‌లను తగ్గించాలి.

– శ్రీరామ్



నగరంలోని ఓ షోరూంలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రికల్ స్కూటర్లు



ఒక రెస్టారెంట్ వద్ద ఏర్పాటు చేసిన స్కూటర్ చార్జింగ్ స్టేషన్

విద్యుత్‌కు నేడు అంతరాయం



రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ స్వరూప నగర్, బాలాజీ నగర్, మహాలక్ష్మి నగర్, తారకరామానగర్, శ్రీరామపురం రోడ్ ఏరియా, స్పిన్నింగ్ మిల్లు ఏరియాలలో అంతరాయం కలుగుతుంది.
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఏరియా, షర్మిలా రెడ్డి వీధి, సెంట్రో, శ్రీహిత చిల్డ్రన్ హాస్పిటల్ ఏరియా, టిప్స్‌టాప్స్ ఏరియాల్లో విద్యుత్ ఉండదు.
- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొంతమూరులోని నూకాలమ్మ గుడి ప్రాంతం, ముస్లిం పేట, అంబేడ్కర్ పేట, అఫీషియల్ కాలనీ, వీవీ కొండయ్య లే అవుట్, బ్రాహ్మణ అగ్రహారం, బీసీ కాలనీ, రాయుడు పాకలు, కొలమూరు, కొంతమూరులోని పరిమినగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి ప్రాంతం, సాయిరాం కాలనీల్లో విద్యుత్ ఉండదు.

రేపు పలు ప్రాంతాల్లో..

బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకూ స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామల థియేటర్ రోడ్డు, పెద్దాడ వారి వీధి, గోదావరి గట్టు, మూడు గుళ్ల వీధి, ఉడిపి అక్షయ వీధి, హోటల్ ఫుడ్‌ఎక్స్, ఆచంట వారి వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతివారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, ప్రింటోనికా కలర్ ల్యాబ్ ఏరియాలో సరఫరా నిలిపివేస్తారు.

ఆకుల వీర్రాజుకు ప్రముఖుల పరామర్శ



ఆకుల వీర్రాజును పరామర్శిస్తున్న జక్కంపూడి రాజా



ఈశ్వరమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మార్గాని భరత్ రామ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును ఆదివారం పలువురు పరామర్శించారు. వీర్రాజు మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ ఇటీవల స్వర్గస్తులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఈశ్వరమ్మ చిత్రపటానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీశాఖల మంత్రి కందుల దుర్గేష్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్, తిరుమల విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనసూరి పద్మలత, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, సిటీ యువజన విభాగం అధ్యక్షుడు బిల్డర్ చిన్న, ప్రింటోనిక అధినేత మురళి, సరస్వతి విద్యాపీఠం నిర్వాహకుడు తోట సుబ్బారావు, కడియపులంక సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, కడియం ఉపసర్పంచ్ వెలుగుబంటి నాని, మాజీ సర్పంచ్ సాపిరెడ్డి సూరిబాబు, ప్రముఖ రైతు కందరెడ్డి, మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్, జక్కంపూడి రాహుల్ దత్త, కోలా రామచంద్రరావు, దాసరి తమ్మన్న దొర, కందుల బాబ్జీ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న చిన్న వెంకన్నబాబు తదితరులు

సీటీఆర్ఐ: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వర స్వామి పీఠంలో ఈ నెల 26 నుంచి వారాహి గుప్త నవరాత్రులు ప్రారంభమవుతున్నాయని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు తెలిపారు. ఈ మేరకు సోమవారం రాజమహేంద్రవరంలోని ట్రస్టు కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుప్త నవరాత్రుల్లో భాగంగా ఈ నెల 26 నుంచి జూలై 10వ తేదీ వరకూ అమ్మవారు వారాహీ దేవిగా దర్శనం ఇస్తారన్నారు. ఏటా ఆషాడ మాసంలో వచ్చే రెండో గురువారం వ్యూహాలక్ష్మికి విశిష్ట అభిషేకం చేస్తామని, ఈ ఏడాది జూలై 3న పీఠంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనుగ్రహప్రద ఫౌండేషన్ వైస్ చైర్మన్ సింగంశెట్టి మహితోష్ జూలై 10న 108 కిలోల గంధంతో అభిషేకం చేస్తారన్నారు. ధరణికోట దుర్గా వెంకట హేమవతి, మతల రమేష్, తిరుమారెడ్డి వెంకట అప్పారావు, బాక్స్ ప్రసాద్, వాసంశెట్టి గంగాధరరావు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్యూచర్ కిడ్స్ రజతోత్సవం



విద్యార్థులకు మొక్కలు పంపిణీ చేస్తున్న పాఠశాల డైరెక్టర్ రవిబాబు తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక కవలగొయ్యి రోడ్డులోని ఫ్యూచర్ కిడ్స్ గ్లోబల్ పాఠశాల రజతోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయా రవిబాబు, సీఈవో శ్రీమహశ్వి యేలేటిలను పాఠశాల బృందం, విద్యార్థులు ఘనంగా సత్కరించారు. అలాగే పాఠశాలలో జరిగిన విద్యార్థి నాయకుల ఎన్నికలలో విద్యార్థులందరూ ఉత్సాహంగా పాల్గొని, తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఎన్నికలలో పాఠశాల డైరెక్టర్ రవిబాబు యేలేటి, చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈవో శ్రీమహశ్వి యేలేటి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, డీన్ హర్షిణి పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలి



విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేస్తున్న జక్కంపూడి గణేష్

రాజమహేంద్రవరం రూరల్: ఉచిత విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు ఇవ్వాలని ఉచిత విద్య విద్యార్థి, తలిదండ్రుల సంఘం (ఫెస్పా) జిల్లా అధ్యక్షుడు కొమ్ము సత్తిబాబు డిమాండ్ చేశారు. అనేక పాఠశాలల యాజమాన్యాలు ఈ నిబంధనను సక్రమంగా అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ మేరకు సోమవారం బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద ఫెస్పా ఆధ్వర్యంలో తలిదండ్రులు, విద్యార్థులతో నిరసన ప్రదర్శన, ధర్నా చేశారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్‌ఓ సీతారామమూర్తిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొమ్ము సత్తిబాబు మాట్లాడుతూ పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖ అధికారులు కొమ్ము కాస్తూ విద్యార్థులు, తలిదండ్రులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సీట్లు పొందిన విద్యార్థులను, తల్లిదండ్రులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఫెస్పా కార్యదర్శి సుధీర్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లు కచ్చితంగా ఇచ్చేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లి శిరీష మాట్లాడుతూ గత ఏడాది తన కుమార్తె శ్రీజకు మండపేట నారాయణ పాఠశాలలో సీటు ఇచ్చారని, కానీ రిజిస్టర్‌లో ఆమె పేరు లేకపోవడంతో ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం నగదు తమకు జమ కాలేదని వాపోయారు.

ప్రభుత్వం తీరు దారుణం: జక్కంపూడి గణేష్

ఉచిత విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు ఉచితంగా 25 శాతం సీట్లు తప్పనిసరిగా కేటాయించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ డిమాండ్ చేశారు. ఫెస్పా ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. గత ప్రభుత్వంలో సక్రమంగా జరిగిన విధానం ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఆందోళనలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లో స్నానం చేయాలంటే దడే

రాజమహేంద్రవరం సిటీ: పుష్కర ఘాట్‌లో స్నానం చేయాలంటే భక్తులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన సోమవారం సమితి సభ్యులతో కలసి పుష్కరఘాట్‌ను శుభ్రపర్చారు. అనంతరం మాట్లాడుతూ పుష్కరాల రేవులో భారీ ఎత్తున నాచు, ప్లాస్టిక్, చెత్తా చెదారం పేరుకుపోతుంటే అధికారులు ఏం చేస్తున్నారో అర్థం కావడం లేదన్నారు. నగరంలోని ఆసుపత్రులు, హోటళ్లు, పరిశ్రమలు, ఇతర సంస్థల నుంచి వస్తున్న వ్యర్థాలన్నీ గోదావరిలోనే కలిసిపోతుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రస్తుతం 55 ఎంఎల్‌డీ వ్యర్థాలను శుద్ధి చేయకుండానే మళ్లీ గోదావరిలోనే కలిపేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేషన్ కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటిని ప్రజలందరూ తప్పనిసరిగా కాచి వడకట్టుకుని తాగాలని సూచించారు. మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు రూ.100 కోట్ల నిధులు అఖండ గోదావరి ప్రాజెక్టుకు వచ్చేస్తున్నాయని చెబుతున్నారని, ముందుగా ప్రజలు పుష్కర ఘాట్‌లో పుణ్యస్నానం చేసేందుకు పరిశుభ్రమైన నీరు అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పాల్గొన్నారు.

జనన, మరణాల నమోదు నూరు శాతం జరగాలి



నగరపాలకసంస్థలో జనన, మరణ నమోదు విభాగాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రశాంతి

- కలెక్టర్ ప్రశాంతి
- హెల్త్ విభాగం పరిశీలన

రాజమహేంద్రవరం సిటీ: జనన, మరణాల నమోదుకు సంబంధించిన దరఖాస్తులు పెండింగ్ లేకుండా నూరు శాతం పరిష్కరించాలని కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని పబ్లిక్ హెల్త్ విభాగాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. ఎంత మంది ఉద్యోగులు, సిబ్బంది ఉన్నదీ అడిగి తెలుసుకుని కాసేపు అర్జీదారులతో మాట్లాడారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. సర్టిఫికెట్ల జారీకి ఎంత సమయం పడుతున్నదో వివరాలు సేకరించారు. డ్యాష్ బోర్డును పరిశీలించి పెండింగ్ అప్లికేషన్లపై ఆరా తీశారు. 2023లో సవరించిన జనన, మరణాల నమోదు చట్టం ప్రకారం అప్డేటెడ్ సీఆర్ఎస్ పోర్టల్ ద్వారా జనన ధ్రువీకరణ పత్రాలను పొందాల్సి ఉంటుందన్నారు. డెత్ సర్టిఫికెట్ల జారీకి సంబంధించి మరణానికి గల కారణాన్ని తప్పక నమోదు చేయాలన్నారు. కలెక్టర్ వెంట అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, సెక్రటరీ జి.శైలజావల్లి, ఎంహెచ్‌ఓ వినూత్న, ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు ఉన్నారు.

అర్జీల సత్వర పరిష్కారానికి చర్యలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు అందజేసిన ప్రతి అర్జీకి అర్థవంతమైన సమాధానం ఇవ్వాలని కలెక్టర్ ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 15 వినతులు స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అర్జీలు ఏ దశలోనూ పెండింగ్ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల దృష్ట్యా నగరంలో ఖాళీ స్థలాల వల్ల చుట్టు పక్కల ప్రజలు ఇబ్బంది పడకుండా చూడాలన్నారు.

రక్తదాతకు అభినందనలు



తిరుపతిరావును సత్కరిస్తున్న డాక్టర్ సౌభాగ్యలక్ష్మి తదితరులు

కంబాలచెరువు: ఇప్పటివరకు 25 సార్లు రక్తదానం చేసిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగి తిరుపతిరావు అందరికీ ఆదర్శనీయుడని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సౌభాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక జీజీహెచ్ కార్యాలయంలో సోమవారం ఆయనను ఆసుపత్రి అధికారులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. డాక్టర్ సౌభాగ్యలక్ష్మి మాట్లాడుతూ ఒక యూనిట్ రక్తదానంతో మరో ముగ్గురికి ప్రాణదానం చేయవచ్చన్నారు. రక్తదానంపై ప్రజల్లో చైతన్యం కలిగించే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.